"ఏమిటి ఉష. ఎనీ ఫాలోఅప్ న్యూస్ ఎబౌట్ సుందరమ్మ ఫైనాన్స్ కంపెనీ?" రెసిడెంట్ ఎడిటర్ మాటలకి ఉలిక్కిపడి తేరుకుంది ఉష .

"అమెరికన్ ఎయిర్‌లైన్స్ స్లోగన్ ఎప్పుడన్నా చూశావా?"

ఉష బిత్తరపోయింది ఆ ప్రశ్నకు.

"నథింగ్ బీట్స్ ఎక్స్‌పీరియన్స్ నాకు తెలుసమ్మా. నేనూ నీ వయసులో నిప్పులా పనిచేశాను. నిజాయితీగా రాశాను. కాని ఎన్నాళ్ళు? కొన్నాళ్ళే. సెంట్రల్ గవర్నమెంట్‌ని విమర్శిస్తూ రాసానని నేనప్పట్లో పని చేసిన పత్రికకు న్యూస్‌ప్రింట్ అందకుండా చేశారు. స్టేట్ గవర్నమెంట్‌ని విమర్శించానని కరెంట్ సప్లయ్‌లో కోత విధించారు.

కో-ఆపరేటివ్ సొసైటీలను విమర్శించానని సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ తన అప్పు చెల్లించమని వత్తిడి తెచ్చింది. టెలిఫోన్స్ డిపార్టుమెంట్స్‌ని విమర్శించానని లైన్ కట్ చేశారు.

మున్సిపాలిటీల్ని విమర్శించానని మనవీధిలో చెత్త ఎత్తకుండా చేశారు. ఇప్పుడు చెప్పు. మనం నిజాయితీగా పనిచేయగలమా? నిర్భయంగా వార్తల్ని రాయగలమా రాజీ...తల్లీ...మన బ్రతుకులు రాజీచక్రంలో ఆకులాంటివి."

ఉష ప్రక్కనే కూర్చున్నాడాయన "ఎత్తుకు పైఎత్తు చదరంగపుటెత్తులు నిజాయితీ పరులకంటే అవినీతిపరులకే ఎక్కువ తెలుసమ్మా. నువ్వు సుందరమ్మ ఫైనాన్స్ కంపెనీ గురించి చెడుగా రాశావు."

"నేను చెడుగా రాయలేదు సార్. ఉన్నదే రాశాను"

"ఓ.కే....ఓ.కే. చెడుగా రాయలేదు. వున్నదే రాసావు. బాగానేవుంది. నీ ఎత్తుకు పైఎత్తుగా ఈరోజు ఎవరెవరికి ఎంతివ్వాలో అంతిచ్చేస్తున్నాడు. సో...సుందరమ్మ మీద చందాదారులకు మరింత నమ్మకం ఏర్పడుతుంది.

నీ రిపోర్టుతో నీవు ఆమెకు పునర్జన్మ ఇచ్చినట్లేగదా. కొద్దిరోజుల్లో పెద్ద చిట్స్ వేస్తుంది అప్పుడు పెద్దమొత్తంలో వసూలు చేసుకుంటుంది సొమ్ము. అప్పుడు మరలా నువ్వు రిపోర్టు వ్రాశావనుకో ఏమవుతుంది. మొన్నీమధ్య ఆమెమీద కొందరు చెడుగా వ్రాశారు. అలాగే ఇదీను.

ఎవరో గిట్టనివాళ్ళు చేసేపనిగానే రిపోర్టుని తుంగలో తొక్కేస్తారు? మరికొద్ది సేపట్లో రిజాయిండర్‌గాని, సుందరమ్మ అందరికీ డబ్బు వాపసు ఇచ్చేసిందనిగాని రిపోర్టు వస్తుంది. ఆది వేయక తప్పదు కదా.

కనుక ఆవేశం నిజాయితీతోపాటు సమస్యపట్ల పూర్తి అవగాహన వుండాలి. ఆ అవగాహన వెనక లౌక్యం వుండాలి, వస్తాను మరి" రెసిడెంట్ ఎడిటర్ ఉద్బోధ చేసి తనగదిలోకి వెళ్ళిపోయాడు.

ఆమెకు ఉక్రోషంగా ఉంది. సుందరమ్మ అవినీతి పనుల్ని, మోసాల్ని చీల్చి చెండాడాలనుకుంటే అనుకోకుండా కథ హఠాత్తుగా మలుపు తిరిగింది. చందాదారుల మొత్తాన్ని సవ్యంగా తిరిగి చెల్లించినా ఆమె వెనుక ఏదో గూడుపుఠాణి ఉంది.

ఆమెకు భుజంకాసే ఘరానా వ్యక్తులు ఎవరో ఉన్నారు. వాళ్ళను బయటకు లాగందే తను నిద్రపోగూడదు. ఆ సందర్భంలో ఎదురయ్యే ప్రమాదాల్ని ఎదుర్కొనేందుకు తనను రక్షించిన యువకుడి సహకారం తీసుకోవాలి. ఓ నిశ్చయానికొచ్చి అప్పుడు స్థిమితంగా సర్దుకు కూర్చుని న్యూస్ వ్రాయడం మొదలుపెట్టింది.

0 0 0

సర్కిల్ టీబంక్ దగ్గరకొచ్చేసరికి టైమ్ సరిగ్గా 7-30 అయింది. బంక్‌లోపల వున్న బల్లలవేపు చూశాడు. ఐదారుగు కస్టమర్స్ టిఫిన్ చేస్తూ కనిపించారు. అందులో ఉదయ్ లేడు.

"చిన్న గొడవలో రౌడీల్ని చితకబాదిన కుర్రాడు రాత్రి వచ్చాడా" సర్కిల్ బంక్ యజమానికి అనుమానం రాకుండా అడిగాడు.

"వచ్చాడు బాబూ, రాత్రి పొద్దుపోయేముందు వచ్చి ఇక్కడే బల్లమీద తొంగున్నాడు. మరలా ఉదయమే లేచి ఒక బన్ తిని, టీ త్రాగేసి వెళ్ళిపోయాడు.

ఆలస్యంగా వచ్చి తను చేసిన పొరపాటుకు బాధపడ్డాడో క్షణం సర్కిల్. తప్పదు....సుదీర్ఘ నిరీక్షణ తప్పదనుకుని అక్కడే ఓ బల్లమీద సెటిలయిపోయాడు సర్కిల్.

క్షణాలు..నిమిషాలు...గంటలు...గడిచిపోతున్నాయి. ఆ నిరీక్షణ సర్కిల్‌కి విసుగనిపించలేదు. అది అతనికి వృత్తిరీత్యా ఏర్పడిన అలవాటు.

మధ్యాహ్నం ఒకటి కావడానికి మరి అయిదు నిమిషాలుందనగా మంటలు కక్కుతూ వచ్చాడు ఉదయ్.

అతని కళ్ళలో లీలగా నిరాశా, నిస్పృహలు స్పష్టమవుతున్నాయి. ముఖం సీరియస్‌గా వుంది. ఉదయ్ వస్తూనే ఓ టేబిల్‌మీద వున్న నీళ్ళ గ్లాసును తీసుకుని మొఖం మీద చల్లుకున్నాడు. మరోగ్లాసు నీళ్ళు తీసుకుని గడగడ తాగేసి ఒకింత రిలాక్స్ అయ్యాడు.

సర్కిల్ మౌనంగా వచ్చి ఉదయ్ ముందున్న టేబిల్‌కి ఇటువేపు కూర్చున్నాడు.

"ఉదయ్!" సర్కిల్ పిలుపుకు ఉదయ్ తలెత్తి చూశాడు గానీ పెద్దగా ఆశ్చర్యపోలేదు. ఉదయ్ నువ్వేనని తనని అతని పేరుపెట్టి పిలవగానే ఆశ్చర్యపోతాడనుకున్న ఉదయ్ మామూలుగా తనకేసి చూట్టం సర్కిల్‌కి అశ్చర్యగా వుంది. అప్పుడనుకున్నాడు సర్కిల్....ఉదయ్ లోతయిన మనసున్నవాడని.

"చెప్పాను కదా? మంచికోసమే అని రుజువు చేయగలిగితే కిరాయి తీసుకుని పని పూర్తి చేస్తాను" అని సర్కిల్‌కేసి చూస్తూ "ఓ ప్లేట్ మీల్స్ పంపు జవహర్ భాయ్" అన్నాడు బంక్ యజమానివేపు చూపులు మరల్చి.

ఆకలి మీదున్నట్లున్నాడు. అది తీర్చుకునేవరకు ఆగటం మంచిదనుకున్నాడు సర్కిల్. అరగంటవరకు మౌనంగా వుండిపోయాడు.

"మంచి పనికి అని రుజువుచేయడం యిప్పుడిప్పుడే వీలుపడదు. ఒకటి మాత్రం ఖచ్చితంగా చెప్పగలను ఈ ప్రాంతాన్ని తన సొంతరాజ్యంగా చేసుకు బ్రతుకుతున్న యిద్దరు ఘరానా వ్యక్తుల ఆట కట్టించటానికే మా యుగంధర్ సాబ్ వస్తున్నట్లు చెప్పగలను."

ఉదయ్ మౌనంగా విన్నాడు.

"నాకు తెలుసు నువ్విప్పుడు మీ అమ్మా, అక్కలకోసం అన్వేషణ సాగిస్తున్నావ్."

ఉదయ్ చటుక్కున తలెత్తి సర్కిల్ వేపు చూశాడు. ఆ కళ్ళలో ఆశ్చర్యం స్పష్టంగా తొ ంగిచూసింది.

"యస్! ఇంత పెద్దనగరంలో వారి జాడ నీకంత తేలిగ్గా దొరకదు. సినిమా కాదుగా విడిపోయిన పాతిక సంవత్సరాలకయినా చూసీ చూడగానే గుర్తుపట్టడానికి, గుడిగంటలు మ్రోగడానికి.

ఇది జీవితం... నువ్వు వారిని గుర్తు పట్టగలిగినా పన్నెండు సంవత్సరాల కఠోర జైలు జీవితం భౌతికంగా నీలో చాలా మార్పులు తీసుకొచ్చి వుంటుంది. సో....మీ అమ్మా, అక్కా జాడ కనిపెట్టడం చాలా కష్టమైన పని."

"మొత్తానికి 24 గంటల్లో నా గురించిన వివరాలు చాలా సేకరించారు" ఒకింత ప్రశాంతతతో అన్నాడు ఉదయ్.

"అవసరం వున్నప్పుడు తప్పదు? అయినా మా వృత్తి మాకు నేర్పే తొలిపాఠం" సర్కిల్ ఒకింత హుషారుగా అన్నాడు.

"ఇంతకీ ఏమిటి విషయం?" తెగేసి అడిగాడు ఉదయ్.

"ఏవుంది? నీక్కావలసిన అడ్రస్ సరిగ్గా వారంలో నేను పట్టుకుంటాను. నాక్కావలసిన పని నువ్వు చేసిపెట్టాలి" రిక్వెస్టింగానే అడిగాడు సర్కిల్.

ఉదయ్ మౌనంగా వుండిపోయాడు.

"మేము నీతో చేయించాలనుకున్న పని వెనుక మంచి వుందని నిన్ను నమ్మించడం యిప్పుడే సాధ్యం కాదు. మా యుగంధర్ సార్ ఈ నగరానికి వచ్చి చెడుకి నిరసనగా నగారా మ్రోగించినప్పుడే కదా అది ప్రత్యక్షంగా క్రియారూపంలో నీకు కనిపించేది. సో..."

"అర్థమైంది.  నాకు మాట తప్పటం అన్నది పెద్ద కోపాన్ని తెప్పిస్తుంది. మీ పని రేపే పూర్తి చేస్తాను. ఆ గౌసుద్దీన్ ఇంటి అడ్రస్ యివ్వు."

"చేసిన పని రహస్యంగా వుండాలని మీరనుకుంటే బ్రహ్మదేవుడు కూడా నాతో విషయాన్ని కక్కించలేడు."

సర్కిల్ ఉలిక్కిపడ్డాడు. సరిగ్గా తన మనస్సులో వున్న సందేహాన్ని చదివేసినట్లే భరోసా యిచ్చాడు.

సర్కిల్ అప్పటికప్పుడు ఓ చిన్న స్లిప్‌మీద గౌసుద్దీన్ అడ్రస్ రాసి దానికి వెయ్యిరూపాయలు కరెన్సీ జతచేసి యిచ్చాడు.

"నేను మీ పనిమీద వుంటాను. మా అమ్మను, అక్కను చూడాలన్న ఆరాటమే నాతో మీ పని చేయిస్తుందన్న విషయం మర్చిపోవద్దు" అంటూనే లేచాడు.

వడివడిగా బస్‌స్టాండ్‌కేసి సాగిపోతున్న ఉదయ్‌ని చూసి అనుకున్నాడు సర్కిల్.

ఉదయ్‌కి, సర్కల్‌కి తెలీవి విషయం ఒకటుంది.

యుగంధర్ తన్ను అవినీతిపరుడిగానో, అసమర్థుడిగానో రుజువు చేసయినా తనాసిస్తున్న పోస్టంగ్‌ని కొట్టేయగలడని గౌసుద్దీన్ పసిగట్టాడు.

గౌసుద్దీన్ అప్రమత్తత  గురించి తెలీని ఉదయ్ బస్ ఎక్కేశాడు.

ఒక ఎస్.పి. ఇంట్లో దొంగతనం చేయటం అన్నది క్లిష్టమైనదా? కాదా? ప్రమాదకరమా? కాదా? అన్న మీ మాంస యిప్పుడు ఉదయ్‌లో లేదు. అతని ఆరాటమల్లా దొంగతనం చేస్తే తన ఇంటి అడ్రస్ త్వరగా దొరికిపోతుందిగదా అన్నదే.

ఈలోపే దొ ంగతనం ఎలా చేయాలి? ఇంటి ప్లాన్ ఎలా వుంది? చుట్టుపక్కల ఎన్ని ఇళ్ళున్నాయి? లాంటివి తీతివ్రంగా ఆలోచిస్తున్నాడు.

బస్ రివ్వున దూసుకుపోతోంది. అనుకోకుండా అప్పుడతని కళ్ళముందు సంపూర్ణ వ్య క్తిత్వాన్ని, మానవత్వాన్ని నింపుకున్న బ్రాహ్మణి రూపం కదలాడి కొద్దిక్షణాలు అతన్ని కలవరపెట్టింది.

తనని రిఫార్మ్ చేయాలనుకున్నదామె. అయినా తనను సంస్కరించాల్సినంత తప్పు తనలో వుందా?

హీరో కావాలని ప్రతి మనిషికీ వుంటుంది. తనకూ వుంది. ఆ ఆశను ఓవ్య క్తి కదిలించి తనతో తన మిత్రుడ్ని చంపించాడు. అది తనకి తెలియకుండానే జరిగిపోయిన తప్పు.

కాని తనేదో పెద్ద క్రిమినల్ అయినట్లు అందరూ భావించారు అందరూ భావించినా నష్టం లేదు. కాని తన తండ్రి...తండ్రి గుర్తుకురాగానే అతని కళ్ళు  కోపంతో ఎరుపెక్కాయి.

0 0 0 0

ఆకర్షణీయమైన ప్రకటన...అది.

మధ్యతరగతి ఆశాజీవుల గృహ నిర్మాణం కలగా మిగలనివ్వం. అష్టలక్ష్మి టేక్స్ కేరాఫ్ యువర్ టుమారోస్, కూడు, గుడ్డా, కొంప యిస్తానని అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు అ మూడింటిలో ఏది మీకివ్వకపోవచ్చు. కానీ మేమిస్తాం.

కూడు, గుడ్డా ఎలా అన్నది మీకే వదిలేసి కొంప ఎలా అన్నది మేం పరిష్కరిస్తాం. నెలకు వెయ్యి చొప్పున పది సంవత్సరాలు మీరు మా కంపెనీలో డబ్బు డిపాజిట్ చేస్తూ పోవాలి.

తొలి సంవత్సరంలో వాయిదా తప్పక చెల్లించిన సభ్యులకు మూడు లక్షల ఇంటి లోను ఇవ్వబడుతుంది.

మీరు పది సంవత్సరాలకు వాయిదాల ప్రకారం చెల్లించే మొత్తం 1,20,000. ముందుగానే మేం మీకిచ్చే లోన్ మూడులక్షలు.

ఇన్సూరెన్స్ అంటే మీకు భయం. పాలసీ కట్టించుకునేప్పుడు చెప్పే తీపి మాటలు చెల్లించేప్పుడు చేదుమాటలవుతాయి. మా దగ్గర అలా కాదు.

యాక్సిడెంట్ బెనిఫిట్ ఏ పాలసీ అయినా క్షణాల్లో సెటిల్ చేయబడుతుంది. వెహికల్‌లోను- మీకు వాహనయోగం వుందన్న మీ జ్యోతిష్యుల మాటల్ని మేం నిజం చేస్తాం.

6నెలలు క్రమం తప్పక నెలకు 500 చెల్లించేవారికి టివియస్, లూనా, స్పార్క్... నెలకు వెయ్యి చెల్లించేవారికి స్కూటర్, నెలకు 1500 చెల్లించేవారికి హోండా, యమహా, సుజుకి, కవసాకి మోటార్ సైకిల్స్ రుణాలమీద ఇస్తాం.

పై మేటర్ రాస్తున్న వ్య క్తి కొద్ది క్షణాలాగాడు. అప్పుడు అర్ధరాత్రి కావటానికి మరో 5 నిమిషాలే వుంది. ఊరికి దూరంగా మామిడి తోపు మధ్యనున్న ఖరీదయిన గెస్టుహవుస్ చీకటి నిశ్శబ్దంలో స్నానం చేస్తున్నట్టుంది.

ఇప్పుడు బంగ్లా మెయిన్ హాల్లో మాత్రమే లైట్స్ వెలుగుతున్నాయి. ఆ హాలు మధ్యనున్న ఖరీదయిన సోఫాల్లో ఓ ప్రక్క మధుమూర్తి, మరో ప్రక్క మంత్రి పట్టాభి, వారి ప్రక్కనే ఆనందకుమార్ జగ్గి అనే నార్తిండియన్ ఆసీనులయి వున్నారు.

వారి ముందున్న కార్పెట్ పై ఓ యాభైయ్యేళ్ళున్న వ్య క్తి తన ముందున్న ప్యాడ్‌పై రాస్తూ మధ్య ఆగి ప్రక్కనేవున్న ఆంగ్ల ప్రకటనను పరిశీలనగా చూశాడు.

"ఎంతవరకొచ్చింది?" మధుమూర్తి అడిగాడు.

"అయిపోవచ్చింది సార్" రాస్తున్న వ్య క్తి వినయంగా అన్నాడు.

"ఏదీ, ఒక్కసారి ఇంతవరకు రాసింది చదివి వినిపించు" మంత్రి పట్టాభి తన ప్రక్కనేవున్న సుందరమ్మ మీదకు వాలిపోతూ అన్నాడు.

అతను మొత్తం చదివి వినిపించాడు.

అది విని పట్టాభి పెదవి విరిచాడు "ప్రజలు నమ్మరయ్యా ప్రకటన అలా వుంటే..."

మధుమూర్తి కూడ పెదవి విరిచాడు.

"ముందు అంతా అనువదించనియ్ ఆ తర్వాత సవరణలు చేయవచ్చు" పట్టాభి అన్నాడు.

జగ్గి ఎంతవరకొచ్చిందని ఆంగ్లంలో అడిగాడు అయిపోవచ్చిందంటూ ఆంగ్లంలోనే సమాధానమిచ్చాడు మధుమూర్తి .